గడప గడపలోనూ సంతోషం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో గడప గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు.ఆదివారం మండలంలోని గుంజేపల్లి, నలపరెడ్డిపల్లి, మంగపట్నం, హెచ్.సోదనపల్లి గ్రామాల్లో ఆమె ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఆయా గ్రామాలకు చేరుకోగానే గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరంవారు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులతో అక్కడికక్కడే చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కష్టాలను తెలుసుకున్న జగనన్న వారి అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. కుల,మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలో గడప వద్దే పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. నిత్యం ప్రజలకు ఏదో ఒక పథకం ద్వారా ఆదుకుంటున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగనన్న ఇంత చేస్తున్నా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నాయన్నారు.

ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజలు మరోసారి జగనన్న పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికారి ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, సర్పంచులు రాంభూపాల్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ కాటమయ్య, కో ఆప్షన్ షాబీరా, నాయకులు రంగారెడ్డి, కాటంరెడ్డి, పెద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుంజేపల్లిలో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

క్లుప్తంగా

నారాయణస్వామి నమోస్తుతే!



నారాయణుడిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: ఆశ్వయుజ మాసం మూడో ఆదివారం సందర్భంగా అశ్వత్థనారాయణుడికి అర్చకస్వాములు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్ కుమార్ శర్మ, సునీల్ కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా ఆశ్వయుజ, కార్తీక, మూడో శని, ఆది, సోమవారాల్లో క్షేత్రానికి ఎక్కువమంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఈసందర్భంగా క్షేత్రానికి వచ్చిన భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామికి ముడుపులు, కానుకలతోపాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుజదోషం ఉన్న భక్తులు సుబ్రమణ్యేశ్వర స్వామికి తైలాభిషేకాలు చేయించారు. భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మల్లికార్జున ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



చాగల్లులో జెండాలను ఊరేగిస్తున్న ముస్లింలు

పెద్దపప్పూరు: చాగల్లులో ముస్లింలు ఆదివారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్లూరు మండలం కొండాపురం కుల్‌షరీఫ్ దర్గా నిర్వహకుడు అత్తర్‌షావలి నేతృత్వంలో చాగల్లు గ్రామానికి చెందిన హాజీపీరా ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు దస్తగిరి స్వామి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు గ్రామాలో జెండాలను ఊరేగించారు. పెద్దపప్పూరు, పెద్దయక్కలూరు, చింతరపల్లి నుంచి ముస్లింలు అధికసంఖ్యలో తరలిచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన విద్యార్థితో పాఠశాల పీడీ గోపాల్‌రెడ్డి, అధికారులు

బుక్కరాయసముద్రం: జాతీయ స్థాయి జూడో పోటీలకు బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దర్శన్‌తేజ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లా చిగిచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో అండర్-14 విభాగం జూడో పోటీలలో బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దర్శన్ తేజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జమ్మూ కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విద్యార్థిని హెచ్‌ఎం, సత్యసాయి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరి అంజన్న, అనంతపురం జిల్లా జూడో అసోసియేషన్ సీఈఓ బాబు టోర్నీ ఆర్గనైజర్ ప్రతాప్‌రెడ్డి, పీడీ లలితమ్మ అభినందించారు.

జిల్లా సమాఖ్య ప్రధాన కార్యదర్శికి సన్మానం



సుహాసినిని సన్మానిస్తున్న మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు

బుక్కరాయసముద్రం: ప్రశాంతి జిల్లా సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా బుక్కరాయసముద్రం మండల చైతన్య సమాఖ్య అధ్యక్షురాలు, చెన్నంపల్లికి చెందిన సుహాసిని ఎన్నికయ్యారు. దీంతో ఆదివారం వైకేపీ కార్యాలయంలో సుహాసినిని సన్మానించారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం మహిళలకు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సంఘాల సభ్యులకు తెలియ పరచడంతో పాటు సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జిల్లా సమాఖ్యలో తమకు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల చైతన్య సమాఖ్య కార్యదర్శి మాధవి, కోశాధికారి విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, ఈసీ మెంబర్ నీలమ్మ గ్రామైక్య సంఘాల లీడర్లు, సభ్యులు, వైకేపీ అధికారులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఫిర్యాదు చేసే వారు తప్పకుండా ఆధార్, సెల్ ఫోన్ నంబర్ వేయాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ సూచించారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఆదివారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన రాజశేఖర్ పామిడికి బయలుదేరాడు. గాంధీ సర్కిల్ సమీపంలో ఎదురుగా మరో బైక్ అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌ను అక్కడున్న వారు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త ఓబుళరెడ్డి ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి పాటుపడ్డాడు. అయితే 8 ఏళ్ల క్రితం ఓబుళరెడ్డి మృతి చెందాడు. కార్యకర్తను గుర్తుపెట్టుకొని ఓబుళరెడ్డి కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే రూ.51వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భార్య గంగమ్మకు ఎమ్మెల్యే చెక్కును అందజేశారు. ఎమ్మెల్యేకు గంగమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జోనాల రామకృష్ణ, సూరి, తిప్పన్న పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సోదాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లు రూరల్: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నరసింగప్ప ఇందిరమ్మ కాలనీ వాసులను హెచ్చరించారు. డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున రూరల్ పోలీసులు స్థానిక దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మహేశ్వర రెడ్డి, రూరల్ ఎస్సై సురేష్, కసాపురం ఎస్సై గోపాలుడు ఇతర సిబ్బందితో కలిసి డీఎస్పీ కాలనీలో తరచూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న టిడ్కో హౌసింగ్ ఏరియా, సుంకులమ్మ ఆలయం ఏరియా, దోనిముక్కల రోడ్డు తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. సోదాల్లో రికార్డులు లేని 10 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్, అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం, వ్యభిచారం వంటివి నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

అశ్వ వాహనంపై శ్రీవారి విహారం



అశ్వ వాహనంపై విహరిస్తున్న చింతల వెంకటరమణస్వామి

తాడిపత్రి అర్బన్: చింతలరాయుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చింతల వెంకటరమణస్వామి వారు ఆదివారం రాత్రి అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం చింతలరాయుడిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. సంధ్యా సమయంలో చింతలరాయుడు అశ్వ వాహనంపై కల్కి అలంకరణలో తిరువీధుల్లో విహరించారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామికి పూజలు నిర్వహించారు.

నేడు చక్రస్నానం:

చింతల వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగియనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత చింతల వెంకటరమణ స్వామికి స్నపన తిరుమంజన, చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రి నిర్వహించే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి

పామిడి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ పట్టణ నూతన కన్వీనర్‌గా జోజోడే కుమార్ ప్రమాణం చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేను నాయకులు సన్మానించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయక పార్టీ అభ్యున్నతికి పాటుపడతానని ఈసందర్భంగా నూతన కన్వీనర్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, మండల రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్ రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పామిడి: ఎద్దులపల్లిరోడ్డులోని రహమత్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ మండలస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణ రెడ్డి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఉరవకొండ: మోపిడి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆదివారం ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కళ్యాణదుర్గానికి చెందిన హనుమంతు ద్విచక్రవాహనంలో ఉరవకొండకు వస్తుండగా మోపిడి గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే 108లో అతడిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మూడో సారి 'ముచ్చుకోట'కు నీరు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



ప్రాజెక్టులోకి వస్తున్న నీరు

పెద్దపప్పూరు: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో ముచ్చటగా మూడోసారి ముచ్చుకోట ప్రాజెక్టుకు నీరు చేరుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లో కెళితే.. ముచ్చుకోట ప్రాంతంలో ప్రాంతంలో చాలామంది రైతులు బోరుబావుల కింద వివిధ రకాల పంటలను సాగుచేస్తారు. 2020కి ముందు దాదాపు 20 ఏళ్లకు పైగా ముచ్చుకోట ప్రాజెక్టుకు అప్పటి నాయకులు నీళ్ల విడిపించిన పాపాన పోలేదు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తప్పనిసరిగా నీరు విడుదల చేసామని హామీ ఇవ్వడం పదవిలోకి వచ్చిన తరువాత అటువైపు కన్నెత్తి చూడక పోవడం అలవాటు చేసుకున్నారు. దీంతో దాదాపు 1200 బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో చాలామంది రైతులు భూములను బీడుగా వదిలేయాల్సి వచ్చింది. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడిపత్రికి ప్రతి పక్షనాయకుడిగా వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాగల్లు, పెండేకల్లు, ముచ్చుకోట ప్రాజెక్టులకు నీరు విడిపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అందులో భాగంగా 2021 నుంచి మూడు ప్రాజెక్టులకు నీరు విడుదల చేయించారు. అప్పట్లో ముచ్చుకోట ప్రాజెక్టుకు వచ్చే నీటి కాలువ శిథిలావస్థకు చేరడంతో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన సొంత ఖర్చుతో పూడికతీత పనులను చేయించారు. 2019 ఎన్నికల్లో ముచ్చుకోటకు కేతిరెడ్డి వచ్చిన తరుణంలో తాను రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయించిన తరువాతే మళ్లీ గ్రామంలో అడుగుపెడతానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. అన్నమాటకు కట్టుబడిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి సమస్యను తీసుకుపోయి 2021 నుంచి ఇప్పటి వరకు ఏటా నీరు విడుదల చేయిస్తున్నారు. ఈ ఏడాదికిగాను నాలుగు రోజులుగా ముచ్చుకోట జలాశయానికి కాలువ ద్వారా నీరు వచ్చి చేరుతుండడంతో రైతన్నలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దపప్పూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించన్నుట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులో ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్యల ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్లు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 10,11,14,15వ వార్డుల్లో మురుగుకాలువలు శుభ్రం చేయించారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం దోమల నివారణకు ఫాగింగ్ చేశారు.

ఎమ్మెల్యే చొరవతో రహదారుల నిర్మాణం



బొప్పేపల్లి కోనకు వేసిన తారురోడ్డు

యల్లనూరు: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి చొరవతో మండలంలోని పలు గ్రామాల రోడ్లకు మోక్షం లభిస్తోంది. మండలంలోని బొప్పేపల్లి నుంచి ఓబులేసుని కోన వరకు 1.6 కిలోమీటర్ల మేర రూ.90 లక్షలతో తారురోడ్డు నిర్మించారు. తిమ్మంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి చింతకాయమంద వరకు 1.6 కిలోమీటర్ల మేర రూ.35 లక్షలతో తారురోడ్డు పనులు జరుగుతున్నాయని మండల ఇంజినీరు నరేంద్రబాబు తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

తాడిపత్రి అర్బన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ టిప్పర్‌ను సెబ్ పోలీసులు సీజ్ చేశారు. ఆదివారం ఉదయం రూరల్ పరిధిలోని బోగసముద్రం సమీపంలో సెబ్ సీఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా తాడిపత్రి నుంచి ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి డ్రైవర్ పుచ్చా వేణుగోపాల్‌రెడ్డి అరెస్ట్ చేశారు. టిప్పర్‌ను తాడిపత్రి రూరల్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ తెలిపారు.

ఎమ్మెల్యేకు బ్రాహ్మణ సంఘం సన్మానం



బ్రాహ్మణ సంఘం సభ్యులతో ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు టీవీ లోక్‌నాథ్ శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఇటీవల బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన టీవీ లోక్‌నాథ్ శర్మ సంఘం సభ్యులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన బ్రాహ్మణుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. బ్రాహ్మణులకు కల్యాణమండపం ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి 13 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. గౌరవ అధ్యక్షుడు కరణం సత్యనారాయణ రావు, కోశాధికారి ఆర్‌వీ ప్రకాష్ , ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం



అక్తర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

తాడిపత్రి అర్బన్: వివాహ నిమిత్తం ఓ పేద ముస్లిం కుటుంబానికి ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. పట్టణంలోని రోజా మసీదు వీధిలో నివాసముంటున్న కె.అక్తర్ వలి తన కుమార్తె వివాహానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు అక్తర్‌కు తమ వంతు సాయంగా రూ.12,500ల నగదు అందజేశారు. అక్తర్ కుటుంబ సభ్యులు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వరుస చోరీలతో జనం బెంబేలు

పుట్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న చోరీలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. నెల రోజుల క్రితం పుట్లూరులో పట్టపగలే ఇంట్లోకి చొరబడిన దొంగలు 16 తులాల బంగారు, రూ.40 వేల నగదు, బాలాపురంలో రూ.53 వేలు నగదును అపహరించారు. వీటితో పాటు కందికాపుల, చింతకుంట, కడవకల్లు, రంగమనాయునిలపల్లి, నారాయణరెడ్డిపల్లి, రంగమనాయునిపల్లి, మడ్డిపల్లిలో డ్రిప్పు వైర్లు, కేబుల్ వైర్లు, చింతకుంటలో ఆటో టైర్ల చోరీ, పుట్లూరులో తాగునీటి బోరుబావి స్టార్టర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. శనివారం మండలకేంద్రంలో రెండు బోరుబావుల వద్ద కేబుల్ వైర్లను అపహరించారు. పోలీసులు వరుస చోరీలను అరికట్టకపోతే రైతులు మరింత ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

నిర్ణీత వేళల్లో రైళ్లు నడపాలి

తాడిపత్రి అర్బన్: నిర్ణీత వేళల్లో రైళ్లను నడపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్‌లోని స్టేషన్‌మాస్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ సకాలంలో రైళ్ల రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ బోగీలు ఎక్కడికి వస్తాయో తెలియక ప్రయాణికులు సతమతమవుతున్నారన్నారు. రైల్వే స్టేషన్‌లో ఇటీవల చోరీలు అధికమయ్యాయని, నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు నాగేంద్ర, సూరి, శ్రీనివాసులు, రమణ, అబ్రహం, ఉమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి





గుత్తిలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు , తాడిపత్రిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న కార్మికులు

గుత్తి: నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఆర్టీసీ కార్మికులు, యూనియన్ నాయకులు ఆదివారం ధర్నా చేపట్టారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట పలువురు ఆర్టీసీ కార్మికులు, యూనియన్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డ్రైవర్‌పై అకారణంగా దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వారందరినీ వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గుంతకల్లుటౌన్: నెల్లూరు జిల్లా కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్ రాంసింగ్‌పై విచక్షణా రహితంగా దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్టీసీఈయూ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎంకె.మూర్తి, జి.కృష్ణ డిమాండ్ చేశారు. డ్రైవర్‌పై దాడికి వ్యతిరేకంగా ఆదివారం ఆర్టీసీఈయూ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. భవిష్యత్తులో ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈయూ రీజినల్ కమిటీ సభ్యులు లోకేష్, షాషావలి, గ్యారేజీ కార్యదర్శి జోసెఫ్, ఏడీసీ బసవరాజు, గోవింద్‌యాదవ్, హరికృష్ణ పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: కావలిలో ఆర్టీసీ డ్రైవర్ రాంసింగ్‌పై దాడికి నిరసిస్తూ స్థానిక డిపో వద్ద ఈయూ, ఎస్‌ఎంయూ నాయకులు ఆదివారం ఉదయం నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసి డ్రైవర్‌పై దాడికి తెగబడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.